రక్తసిక్తాలయ్యాయి. చివరికి విభీషణుడు వేసిన బాణాలకి అతని తల తెగి నేల మీద పడింది. రాక్షసులంతా హాహాకారాలు చేస్తూ లంకలోకి పరిగెత్తితే, వానరులు ఆనందంగా అరిచారు.

విభీషణుడు నెమ్మదిగా రథం దిగి, కిందపడ్డ ఆ తల దగ్గరకి వెళ్ళి, దాన్ని ఒళ్ళోకి తీసుకుని 'హా కుమారా!' అని రోదించసాగాడు.

"అతను నీ కొడుకే అని నాతో ముందే ఎందుకు చెప్పలేదు?" అది గమనించిన రాముడు బాధగా చూస్తూ అడిగాడు.

"అధర్మపరుడు నా అన్న అయితే ఒకటీ, నా కొడుకైతే ఇంకోటీ కాదుగా. ధర్మానికి అడ్డు వచ్చిన ఎవరినైనా సరే అడ్డు తొలగించాలన్న ధర్మాన్ని పాటించాను." విభీషణుడు చెప్పాడు.

## 46. గుర్తింపు

ఓ శిష్యుడు గురువుని తన సందేహం తీర్చమని కోరుతూ ఇలా అడిగాడు.

"స్వామీ! ఓ జ్ఞాని మాత్రమే ఇంకో జ్ఞానిని గుర్తిస్తాడని పెద్దలు చెప్తూంటారు కదా. ఇది నిజమేనా?"

"నిజమే." ఒప్పుకున్నాడు గురువు.

"జ్ఞాని, జ్ఞాని కాని వాడు ఎలాంటి తేడా లేకుండా చూడటానికి ఒకేరకంగా కనిపిస్తూంటారు కదా. మరి వాళ్ళా విషయాన్ని ఏ గుర్తుల ద్వారా తెలుసుకోగలుగుతారు?" ప్రశ్నించాడు శిష్యుడు.

"ఓ గదిలో తొమ్మిది మంది నిద్రిస్తున్నారనుకుందాం. వారిలో ఒకరికి మెలకువ వచ్చి లేచి కూర్చున్నాడు. అప్పుడు ఎవరు మేలుకుని వుందీ, ఎవరు నిద్ర పోతున్నదీ ఎవరికి తెలుస్తుంది?" ప్రశ్నించాడు గురువు.

"మెలకువ వచ్చిన అతనకి ఆ సంగతి తెలుస్తుంది." జవాబు చెప్పాడు

"సరే. మిగిలిన వారిలో ఇంకొకడికి కూడా మెలకువ వచ్చింది. అప్పుడు అతనూ లేచాడు. ఎవరు మేలుకుని వున్నారో, ఎవరు పడుకుని ఉన్నారో ఆ

గదిలోని ఆ తొమ్మిది మందిలో ఎవరు గుర్తించగలరు?" నవ్వుతూ ప్రశ్నించాడు గురువు తన శిష్యుడ్ని.

"మేలుకుని ఉన్న ఇద్దరూ ఆ సంగతి గుర్తించగలరు." చెప్పాడు శిష్యుడు.

"నిద్రపోతున్న వాళ్ళకి ఎవరు మేలుకుని ఉన్నారో తెలుస్తుందా?"

"తెలీదు స్వామీ. మేలుకుని ఉన్న వారికే ఎవరు నిద్ర పోతున్నారో, ఎవరు మేలుకుని ఉన్నారో తెలుస్తుంది."

"అజ్ఞానం లోంచి మేలుకున్న ఓ జ్ఞానిని ఇంకో జ్ఞాని గుర్తించగలగడం కూడా సరిగ్గా ఇలాగే జరుగుతుంది." వివరించాడు గురువు.

## 47. స్వర్గపు భోజనం

ఓ ధనవంతుడు బీదలకి అన్నదానం చేసి కీర్తి గడించాలనుకుని ఓ అన్నదాన సత్రాన్ని ప్రారంభించాడు. ముక్కి పోయి, పురుగులు పట్టి చవకగా దొరికే బియ్యాన్ని కొని అతను యాత్రికులకి అన్నం పెట్టేవాడు. ఆయన లోభ గుణాన్ని చూసిన అతని కూతురు నొచ్చుకునేది.

ఓ రోజు ఆమె తల్లి తీర్థయాత్రలకి వెళ్ళగానే ఇంటి వంట బాధ్యత ఆమె మీద పడింది. సత్రం నించి తెప్పించిన పురుగుల బియ్యంతో అన్నం వండి తండ్రికి వడ్డించింది. దాన్ని నోట్లో పెట్టుకోగానే ఎలాంటి బియ్యంతో కూతురు అన్నం వండిందో తండ్రికి అర్థమైపోయింది. కంచాన్ని పక్కకి తోసేస్తూ ఆశ్చర్యంగా అడిగాడు ఆయన.

"ఈ బియ్యం ఎక్కడివి నీకు?"

"మన సత్రం నించి మీకోసం ప్రత్యేకంగా తెప్పించి వండాను నాన్నగారు." జవాబు చెప్పింది కూతురు.

"అదేమిటి? ఇంట్లో మంచి బియ్యం వుండగా సత్రం నించి దేనికి ఈ ముక్క బియ్యాన్ని తెప్పించావు? నేను ఈ పురుగులన్నం ఎలా తింటాననుకున్నావు?" మండి పడ్డాడు తండ్రి.